నైపుణ్యాలను పెంచుకునేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

ఇబ్రహీంపట్నం, జనవరి 24: మహిళా సాధికారత కోసం నైపుణ్యాలను పెంచుకునేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎంతగానో దోహదపడుతుందని గురునానక్ విద్యా సంస్థల ఎండీ సైనీ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థల్లో బహుళజాతి కంపెనీ హానీవెల్ సహకారంతో డేటా అనలిస్టుపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సైనీ మాట్లాడుతూ వ్యాపారంలో కష్టమైన సవాళ్లను పరిష్కరించడానికి ఈ వేదికగా పనిచేస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థల్లో ఎదుర్కొనే అంశాలపై అవగాహన కల్పిస్తూ కావాల్సిన పరిశోధనలు చేసేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా

» టీచర్ల అభ్యంతరంతో నిర్ణయం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ జనవరి 24 : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. వాస్తవానికి ఈ నెల 20 నుంచి 29 వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎస్‌ఎంసీ ఎన్నికలను నిర్వహించడంపై ఉపాధ్యాయుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. తొమ్మిది రోజుల పాటు బోధనలు కుంటు పడే అవకాశం ఉండటం, పరీక్షల ముందు గందరగోళం ఏర్పడే పరిస్థితి ఏర్పడనుంది. ఈ ఎన్నికల నిర్వహణపై టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభ్యంతరం వ్యక్తం కావడంతో ప్రభుత్వం ఎస్‌ఎంసీ ఎన్నికలను వాయిదా వేసింది. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారనే విషయాన్ని ఇంకా వెల్లడించలేదు.



ప్రభుత్వాసుపత్రిలో పరిసరాల పరిశుభ్రతపై తెలుసుకుంటున్న పర్యవేక్షకులు డాక్టర్ గౌస్, డాక్టర్ ప్రియాంక

ఆసుపత్రిలో పరిశుభ్రత భేష్

యాచారం, జనవరి 24 : ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించి రోగులకు మెరుగైన సేవలందించడం చాలా భేషుగ్గా ఉందని జిల్లా వైద్య విధాన పరిషత్ పరిశుభ్రత కమిటీ పర్యవేక్షకులు డాక్టర్ మహ్మద్ గౌస్, డాక్టర్ ప్రియాంకలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని వారు తనిఖీ చేశారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు మెరుగైన సేవలు అందించడంపై వైద్య సిబ్బందిని అభినందించారు. రోగులకు ఇంజక్షన్ ఇచ్చిన తరువాత సిరంజి(డిస్పోజబుల్ ఇంజక్షన్)లను నల్లటి కవర్‌లో భద్రపరిచి జిల్లా కేంద్రానికి పంపించాలని సూచించారు. ఒకవేళ డిస్పోజల్ ఇంజక్షన్లతో పాటు ఇతర వ్యర్థాలను ఆరుబయట కాలిస్తే వాతావరణం కలుషితమవుతుందని, రోగులకు ఇబ్బంది ఉంటుందని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉండడంపై వైద్యసిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్ తదితరులున్నారు.

షాద్‌నగర్‌లో 'రక్తహీనత ముక్తభారత్' ప్రారంభం

షాద్‌నగర్, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రక్తహీనత ముక్తభారత్ కార్యక్రమాన్ని షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం రక్త, హిమోగ్లోబిన్ పరీక్ష చేయించుకున్నారు. 8వ తరగతికి చెందిన 58మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు అందించారు. నేటి నుంచి షాద్‌నగర్ డివిజన్‌లో రెండు ఆర్‌బీఎస్ టీంలు 8వ తరగతి నుంచి ఇంటర్మీయట్ సెకండియర్ చదువుతున్న విద్యార్థులందరికీ రోజుకు వందమంది చొప్పున రెండు టీంలు 200మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తారని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. డాక్టర్ స్రవంతి, ఆర్‌బీఎస్‌కే వైద్యసిబ్బంది డా.విజయలక్ష్మి, ఫార్మసిస్టు అన్నపూర్ణ, లోక్‌నాథ్, సునీత, తదితరులు న్నారు.

ఉమ్మడి జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. నిన్న మొన్నటి వరకున్న అసెంబ్లీ ఎన్నికల వేడి తగ్గుతున్న తరుణంలో లోక్‌సభ ఎన్నికలు మళ్లీ రాజకీయ వేడిని రగిలిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ పరంపర సాగించి అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న రెండు లోక్‌సభ స్థానాలనూ కైవసం చేసుకునేందుకు వేగంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని స్థానాలను గెలిచిన బీఆర్‌ఎస్‌ను ఈ సారి కోలుకోలేని దెబ్బతీసేలా వ్యూహం పన్నుతోంది. ఆ పార్టీకి చెందిన కీలక నేతలను కారు దించి హస్తం వైపు మళ్లించే పనిలో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారు. దీంతో ఈ సారి రాజకీయ సమీకరణలు ఎలా ఉంటాయోనన్న ఆసక్తి ఉమ్మడి జిల్లా వాసుల్లో నెలకొంది.



- చకచకా పావులు కదుపుతున్న కాంగ్రెస్
- ఎమ్మెల్యేలు, కీలక నేతలే టార్గెట్
- పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఆపరేషన్ ఆకర్ష్
- మల్కాజిగిరి, చేవెళ్లకు ఇద్దరు కీలక నేతల పేర్లు పరిశీలన

గులాబీపై గురి!

బీఆర్‌ఎస్‌కు త్వరలో భారీ కుదుపు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలు కొంత ముందస్తుగానే జరిగే అవకాశం ఉండడంతో అధికార కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో మరింత బలపడేందుకు కసరత్తు మొదలు పెట్టింది. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలను తమ వైపు తిప్పుకునేందుకు 'ఆపరేషన్ ఆకర్ష్'ను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల పరిధిలో బీఆర్‌ఎస్ కంటే వెనుకబడిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల నాటికి పూర్తి స్థాయిలో పుంజుకుని ఈ రెండు స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యర్థులను తమ వైపు తిప్పుకునేందుకు అన్ని వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్‌కు ఆర్థికంగా నిలబడే బలమైన నేతలు లేరు. దీంతో అభ్యర్థుల ఎంపిక విషయంలో కూడా తర్జనభర్జన పడుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్థికంగా బలమైన బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకుని వీరిద్దరికీ మేడ్చల్, మల్కాజిగిరి లోక్‌సభ టికెట్లు ఇస్తున్నట్లు రెండు రోజులుగా ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కుటుంబంతో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు మంతనాలు జరిపారు. వాస్తవానికి ఎన్నికలకు ముందుగానే వారిని కాంగ్రెస్‌లో రప్పించే ప్రయత్నాలు జరిగినప్పటికీ అప్పటికే మహేందర్‌రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి కొడంగల్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. దీంతో పాటు మహేందర్‌రెడ్డి పార్టీ మారకుండా కట్టడి చేసేందుకు ఆయనకు బీఆర్‌ఎస్ మంత్రి పదవి ఇవ్వడంతో ఆయన వెనక్కి తగ్గారు. ఆయన మంత్రి అయిన తరువాత కూడా కాంగ్రెస్ నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. మంత్రి పదవి ఇవ్వడమే కాక ఆయన సతీమణి వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు ఆఫర్ ఇచ్చారు. అయితే ఎన్నికలకు కొద్ది రోజులే గడువు ఉండడంతో మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి బీఆర్‌ఎస్‌లోనే కొనసాగారు. అయితే, ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మహేందర్‌రెడ్డికి కాంగ్రెస్ నుంచి ఆహ్వానం అందింది. అయితే ఎంపీ సీటు మహేందర్‌రెడ్డికి ఇవ్వాలా? లేక ఆయన సతీమణి సునీతారెడ్డికి ఇవ్వాలా? అనే దానిపై కాంగ్రెస్‌లో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. సునీతారెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా రెండు దఫాలు ఎన్నికయ్యారు. దీంతో ఆమె పేరును కూడా కాంగ్రెస్ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం తాండూరు మున్సిపల్ చైర్మన్ పీఠం మహేందర్‌రెడ్డి వర్గం చేతిలో ఉంది. వీరంతా ఇపుడు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. దీన్ని బట్టి చూస్తే మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం లాంఛనమేనని ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంపై అనేక మంది చూపు ఉన్నప్పటికీ ఇక్కడ నుంచి బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి బలమైన వ్యక్తులు రంగంలో దిగే అవకాశం ఉండడంతో అధికార కాంగ్రెస్ కూడా దీటైన అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్‌కు ఇది సిట్టింగ్ స్థానం కావడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించినందున ఈ సీటును కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుంది. దేశంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చు కూడా అదే స్థాయిలో ఉంటుంది. ప్రధాన పార్టీలు ఒక్కొక్కటీ కనీసం రూ. 100 కోట్లకు పైగానే ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్థికంగా బలమైన వ్యక్తిని రంగంలో దింపాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల పేర్లు పరిశీలనలో ఉన్నా ఆర్థిక మూలాలు బలంగా ఉన్న బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే వైపే కాంగ్రెస్ నాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉక్కిరి బిక్కిరి!

ఇదిలా ఉంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను అధికార కాంగ్రెస్ ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. వారిని నేరుగా పార్టీలోకి ఆహ్వానించకుండానే వారి చుట్టూ ఉన్న బలమైన నేతలను కాంగ్రెస్‌లోకి రప్పించుకునే యత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్, కార్పొరేషన్ పీఠాలపై గురిపెట్టింది. దీంతో అనేకచోట్ల అవిశ్వాస తీర్మానాలు మొదలయ్యాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలియక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా అవినీతి అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగోతాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తవ్వి తీస్తోంది. ముఖ్యంగా నగర శివార్లలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నేరుగా, లేదా ప్రత్యక్షంగా చేసిన భూ దందాలపై దృష్టి సారించింది. వీటి సమాచారం సేకరించి అంతర్గత విచారణ కూడా మొదలు పెట్టింది. దీంతో అప్పట్లో భూ దందాల వెనుక ఉన్న బీఆర్‌ఎస్ నేతల్లో గుబులు మొదలైంది.

» మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంపై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలి
» సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్, షాద్‌నగర్, జడ్చర్ల, మక్తల్, కల్వకుర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు

శ్రీరాముడి పేరుతో బీజేపీ రాజకీయం

షాద్‌నగర్, జనవరి 24 : శ్రీరాముడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని, పార్లమెంట్ ఎన్నికల ముందు ఓట్లు రాబట్టుకునేందుకే హిందూత్వ పేరిట చిచ్చు పెట్టేందుకు ఆ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచందర్‌రెడ్డి, షాద్‌నగర్, జడ్చర్ల, మక్తల్, కల్వకుర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ అన్నారు. బీజేపీ పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వంశీచంద్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తనను గెలిపించాలని పార్టీ కార్యకర్తలను కోరారు. తాను ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని చెప్పారు. 2018లో ఇక్కడి నుంచి తాను ఎంపీగా పోటీ చేసినప్పుడు ఒక్క షాద్‌నగర్ నియోజకవర్గం నుంచే 43,700 మెజార్టీ వచ్చిందన్నారు. ఇక్కడి కార్యకర్తలు పార్టీ నిర్ణయాలను గౌరవించి పార్టీకి అండగా నిలుస్తారని కొనియాడారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారని, వారిని చేర్చుకుని పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో వంశీచంద్‌ను గెలిపిస్తే పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా లభిస్తుందన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ పనులు ఆయనతోనే సాధ్యమవుతాయని చెప్పారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నందున వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ కోసం కృషి చేసిన కార్యకర్తలకు కమిటీలలో పదవులు ఇస్తామని భరోసా ఇచ్చారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ మాట్లాడుతూ దేశంలో కులాలు, మతాల మధ్య ఘర్షణలను నిలువరించి దేశాన్ని కాపాడేందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టారన్నారు. కసిరెడ్డి నారాయణరెడ్డి కోసం వంశీచంద్ ఎమ్మెల్యే సీటును వదులుకున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కొనియాడారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ పార్టీకి క్రమశిక్షణ గల కార్యకర్తలు ఉండటం వల్లనే అది సాధ్యమైందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి పోటీ చేసే అవకాశం ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ అన్నారు. సమావేశంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత ఎల్గనమోని యాదయ్య, జడ్పీటీసీలు విశాల శ్రావణ్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, సీనియర్ నేతలు బాబర్‌ఖాన్, రఘు, శ్యాంసుందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కాశీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచందర్‌రెడ్డి



రాత్రి వేళల్లో మట్టి లోడ్‌తో వెళుతున్న టిప్పర్

తుమ్మలూరు గడ్డకు తూట్లు!

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



తుమ్మలూరు అసైన్డ్ భూమిలో భారీ గోతులు తవ్విన వ్యాపారులు

- » చెరువులు, కుంటలు, అసైన్డ్ భూముల నుంచీ ఇతర ప్రాంతాలకు తరలింపు
- » పచ్చని చెట్లు.. అందమైన గుట్టలు మాయం!
- » భూముల చదును పేరుతో కిలోమీటర్ల మేర మట్టి తవ్వకాలు
- » రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- » పట్టించుకోని అధికార యంత్రాంగం



మట్టిని లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఇటాచీ యంత్రాలు

మహేశ్వరం, జనవరి 24 : చెరువు, కుంటలతో పాటు ప్రభుత్వ, ఫారెస్ట్, అసైన్డ్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం ఎన్ని చట్టాలు రూపొందించినా ఆ చట్టాలు మా చుట్టాలులే అనే విధంగా భూముల చదును పేరుతో వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతూ రైతులకు నయానో భయానో ఇచ్చి అక్రమంగా మట్టిని తరలిస్తూ కోట్లు గడిస్తోంది మట్టి మాఫియా. ఈ తతంగం అంతా ఎక్కడ అనుకుంటున్నారా.. హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉన్న మహేశ్వరం మండలంలోని నాగిరెడ్డిపల్లె, కోళ్లపడకల్, అమీర్‌పేట, గొల్లూరు, సుభాన్‌పూర్, మొహబ్బత్‌నగర్, పోరండ్ల, పెండ్యాల, ఉప్పుగడ్డతండా, కేసీతండా, నందుపల్లి, రావిరాల, సర్దార్‌నగర్, మంఖాల్, హర్షగూడ, సిరిగిరిపురం, దబ్బచర్ల గ్రామాలతో పాటు ప్రధానంగా తుమ్మలూరు గ్రామంలోని సర్వేనంబర్లు 315, 107 లలో వందమందికి పైగా రైతులకు దాదాపు 350 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఈ భూమి వ్యవసాయానికి కొంత ఇబ్బందికరంగా పలుగురాళ్లతో కూడిన గుట్టలా ఉంది. ఇదే అదునుగా భావించిన మట్టి మాఫియా మీ భూములను చదును చేస్తామని చెప్పి ఎంతోకొంత డబ్బు ముట్టజెప్పి తమ పని కాజేస్తున్నారు. పచ్చని చెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా కనిపించే తుమ్మలూరు గడ్డకు అధునాతన యంత్రాలతో తూట్లు పొడుస్తూ రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు మట్టిని తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ఎవరైనా ఇదేమని ప్రశ్నిస్తే.. ఫలానా సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, వివిధ పార్టీల మండలాధ్యక్షులు, తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌తో పాటు మంత్రి, ఏసీపీ, డీసీపీ మావాడే అంటూ కొందరు బడానేతలు అక్రమ మట్టి వ్యాపారానికి తెరలేపుతున్నారు. భూముల చదును పేరుతో సుమారు కిలోమీటర్ల దూరంతో పాటు 50 మీటర్ల లోతుకుపైగా గోతులు తవ్వి మట్టిని తరలిస్తున్నా అడ్డుకునే అధికార యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదు.

మట్టి రవాణాలో రోడ్లన్నీ గుంతలమయం

మండలంలో అడ్డూ అదుపు లేకుండా రాత్రీ పగలు విచ్చలవిడిగా నడుస్తున్న మట్టి వాహనాలతో రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. మట్టి లారీలు ఎక్కడ ఎక్కువగా నడుస్తున్నాయో ఆ రోడ్లన్నీ గంతలమయం అవుతున్నాయి. ఇదంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించకోవడం లేదు. పరిమితికి మించి వాహనాల్లో మట్టిని లోడ్ చేయడంతో రోడ్లపై గుంతలు పడుతున్నాయి. దాంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లమట్టి, ఇటుకల తయారీకి సంబంధించి ఒక్కో లోడు సుమారు రూ.10 నుంచి రూ.13వేల వరకు విక్రయిస్తున్నారు. ఎర్రమట్టిని వివిధ పార్కులకు తరలిస్తూ ఒక్కోలోడు రూ.10వేలకు విక్రయిస్తున్నారు. అంతేకాకుండా మొరంను గుంతమయంగా ఉన్న రియల్ వెంచర్లు, నూతనంగా ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల పరిశ్రమలు, నిర్మాణాల వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. దాంతో రోడ్ల పరిస్థితి ఘోరంగా తయారైంది.

అనుమతులు లేకుండా మట్టి తరలించొద్దు

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఓ ప్రాంతంనుంచి మరో ప్రాంతానికి మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సంబంధిత వాహనాలను సీజ్ చేస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఏవైనా సరే.. మట్టిని తరలించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలి. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- సత్యనారాయణ, ఆర్ఐ, మైనింగ్ శాఖ

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

మండలంలోని చెరువులు, కుంటలు, సీలింగ్ భూముల నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తాం. మట్టిని అక్రమంగా తలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు.

- మహమూద్ అలీ, మహేశ్వరం తహసీల్దార్

పర్యావరణ పరిరక్షణ.. సామాజిక బాధ్యత

కడ్తాల్ , జనవరి 24: పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించి విద్యార్థులు, యువత మసలుకోవాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణ, నాయకత్వ లక్షణాల పెంపుపై ప్రాథమిక దశ నుంచే ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని ది ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించిన లీడ్‌ఎర్త్ లీడర్స్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. పర్యావరణ పరిరక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం కోసం నిర్వహించిన శిక్షణలో నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 65మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకంపైనే భావి తరాల మనుగడ ఆధారపడి ఉందన్నారు. రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ నేటి తరంపై ఉన్న సామాజిక బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో భూగర్భ శాస్త్రవేత్త మహేశ్, సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సభ్యులు ఉమామహేశ్వర్ రెడ్డి, రజనీకాంత్, రమేశ్, వేణుగోపాల్, దీపిక, వెంకటేశ్, బీరేశ్, లక్ష్మీప్రసన్న, నాగేశ్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో లీలాలక్ష్మారెడ్డితో విద్యార్థులు

తాండూరు రూరల్, జనవరి 24 : చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం తాండూరు మండలం 33గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చనిపోయిన, పెళ్లయి వెళ్లిపోయిన వారి వివరాలను రెవెన్యూ అధికారులకు అంద

ఓటరు జాబితాల్లో పేర్ల తొలగింపు షురూ



జేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాను సవరిస్తున్నారు. పీఎస్‌లు లాలప్ప, ఇస్మాయిల్, ఆనంద్‌రావు ఓటరు లిస్టుల వివరాలను అందజేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఓటరు జాబితాలో పేర్లు సరిచేసి కొత్తగా జాబితా సిద్ధం చేస్తున్నారు.

ఉప్పల్ భగాయత్‌లో రజక ఆత్మగౌరవభవన్ నిర్మించాలి



మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కీసర రూరల్, జనవరి 24 : రజక ఆత్మగౌరవ భవన్‌ను ఉప్పల్ భగాయత్‌లో నిర్మించాలని బుధవారం వెనుక బడిన తరగుతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సచివాలయంలో కలిసి మాజీ మంత్రి బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రజక సంఘాల ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ శాఖల్లో రజక వృత్తికి సంబంధిచిన ఉద్యోగాలను, పనులను వారికే కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్వరాజు శంకర్, ఆంజనేయులు, సంపత్, శ్రీనివాస్, రమేష్, కుమారస్వామి, రమేష్, బ్రహ్మయ్య, గంగాధర్, రాములు పాల్గొన్నారు.

సర్వే ల్యాండ్ రికార్డ్స్ యూనియన్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ←

మేడ్చల్ జనవరి 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీఎన్జీఓస్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ యూనియన్ 2024 డైరీని బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. యూనియన్ అధ్యక్షుడు నరహరిరావు, సర్వే డిపార్ట్మెంట్ సమస్యలపై మంత్రికి వివరించగా వాటి పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారని యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎం.రాంచందర్, వి.శ్రీరామ్ పాల్గొన్నారు.

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్లు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి



● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం నగరంలోని కర్మన్‌ఘాట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు దేశం నాయకుడు ఎం.రమేశ్‌బాబు, తదితరులు పాల్గొని బ్లడ్ డొనేట్ చేశారు.

మల్లును కలిసిన కాంగ్రెస్ నాయకులు



రవిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి

తలకొండపల్లి, జనవరి 24: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవిని బుధవారం తలకొండపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి మల్లు రవి ని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టాలని, జిల్లా అభివృద్ధికి ప్రభుత్వపరంగా సహకారం అందించాలని మల్లును కోరగా సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శివలింగం, తదితరులున్నారు.

ఆసుపత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి

ఆమనగల్లు, జనవరి 24 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకర్గ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, మాడ్గుల మండలాల నాయకులు సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆసుపత్రుల్లో ఏళ్ల కాలంగా ఓకే చోట పనిస్తున్న వైద్యులు, సిబ్బందిని బదిలీ చేయాలని, ఖాళీగా ఉన్న వైద్యు లు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలనిన్నారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు దళపతిగౌడ్, రాజశేఖర్, తాలుకా కార్యదర్శి జం గయ్య గౌడ్, ఇమ్రాన్ బాబా, శివప్రసాద్ తదితరులున్నారు.



మంత్రి దామోదరకు వినతిపత్రమిస్తున్న నాయకులు

'న్యాయ్ యాత్ర' జయప్రదం కావాలని దర్గాలో ప్రార్థనలు

కొత్తూర్, జనవరి 24 : ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ చేపడుతున్న న్యాయ్ యాత్ర విజయవంతం కావాలని మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ శివారులో గల హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాహుల్ యాత్రకు ఎటువంటి అడ్డంకులు రాకుండా విజయవంతంగా పూర్తికావాలని దర్గాలో ప్రార్థనలు నిర్వహించినట్లు నాయకులు పేర్కొన్నారు.



గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సంధ్యశ్రీశైలం

మొయినాబాద్ రూరల్, జనవరి 24: గ్రామంలోని అన్ని కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే తన ధ్యేయమని అజీజ్‌నగర్ గ్రామసర్పంచ్ బండ్లగూడ సంధ్య శ్రీశైలం తెలిపారు. ఇటీవల గ్రామంలో దాదాపు అన్ని కాలనీల్లో గ్రామపంచాయతీ నిధులు సుమారు రూ. 60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను సర్పంచ్ సంధ్యశ్రీశైలం బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ నిధులతో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు నేటికి రాకున్న గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయలనే లక్ష్యంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు గుర్తు చేశారు. గ్రామంలోని అన్నివర్గాల ప్రజల్లోని కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే తన ధ్యేయమన్నారు. గ్రామంలోని ప్రజలు సహరిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు కొండల్‌రెడ్డి, కాసోజు గీతాచారి, మౌనిక, నాయకులు బండ్లగూడ శ్రీశైలం, రాజగోలచారి, ధన్‌రాజ్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారులకు రూ.లక్ష సాయం అందించాలి

కడ్తాల్, జనవరి 24 : రజక వృత్తిదారులకు రూ.లక్ష సాయం అందించి ఆదుకోవాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం మైసిగండిలో జిల్లా అధ్యక్షుడు ఉమేష్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృత్తిదారులకు రూ.లక్ష సాయాన్ని కొనసాగించాలన్నారు. దీనికోసం రూ.లక్షా 25వేల మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. రజక ఫెడరేషన్‌కు నూతన పాలకవర్గాన్ని నియమించి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో దోబీఘాట్లు నిర్మించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్, కార్యవర్గ సభ్యులు నగేష్, చంద్రకళ, బాలరాజు, శ్రీనివాస్, తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- వనంపల్లి, ఎల్కగూడ గ్రామాల్లో పంచాయతీ భవనాల ప్రారంభోత్సం

చౌదరిగూడ, జనవరి 24 : గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వనంపల్లి, ఎల్కగూడ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ఎంపీపీ యాదమ్మ, జడ్పీటీసీ స్వరూపతో కలిసి వీర్లపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నిరుపేదల సంక్షేమం కొరకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు కవితా గోపాల్‌రెడ్డి, అరుణమ్మ, బాల్‌రాజ్, గోపాల్, యాదయ్య, ఎంపీటీసీ రజిత, సత్యనారాయణరెడ్డి, మండలాధ్యక్షుడు రాజు, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, వెంకట్‌నర్సింహరెడ్డి, వేణుగోపాల్, అన్వర్, మల్లారెడ్డి, మల్లయ్య, సంజీవరెడ్డి, దర్శన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వనంపల్లిలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

కొత్తూర్, జనవరి 24: బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడకుండా ముందుకు సాగాలని, వారికి తనతో పాటు పార్టీ అండగా నిలుస్తుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని మక్తగూడ, మల్లాపూర్, మల్లాపూర్‌తండా, కొడిచర్ల, తీగాపూర్, పెంజర్ల, సిద్దాపూర్, ఎస్‌బీపల్లి, ఇన్ముల్‌నర్వ, వైఎం తండా గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి కార్యకర్తలతో సమావేశమైనారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు కార్యకర్తలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ఈ విషయాన్ని ప్రతీ కార్యకర్త గమనించాలన్నారు. ప్రజా తీర్పును ప్రజలు, నాయకులు, కార్యకర్తలు గౌరవించాలన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో ఉంటూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించాలని పిలుపునిచ్చారు. తన హయాంలో షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపి, అర్హులైనవారికి సంక్షేమ ఫలాలు అందజేయడం జరిగిందని గుర్తుచేశారు. జడ్పీ వైస్ చైర్మన్ గణేష్, మక్తగూడ సర్పంచ్ రాజు, రమాదేవిరమేష్, అజయ్‌మిట్టునాయక్, అరుణ, రవినాయక్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, కడెంపల్లి శ్రీనివాస్, మెండె కృష్ణ, కళ్లెం నర్సింహ్మారెడ్డి, మెహన్‌రెడ్డి, రంగారెడ్డి, శివ చారి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తీగాపూర్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



మహేశ్వరం : బహుమతులు అందిస్తున్న ఎంపీపీ సునితా అంద్యానాయక్, తదితరులు

మహేశ్వరం, జనవరి 24 : బాలికల ఉన్నత చదువులకోసం తల్లిదండ్రులు ప్రత్యేక తీసుకోవాలని మహేశ్వరం ఎంపీపీ ఆర్.సునితఅంద్యానాయక్ అన్నారు. బుధవాం మహేశ్వరం మోడల్‌సూల్లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలురు ఎక్కువ.. బాలికలు తక్కువ అనే తేడా లేకుండా సమానంగా చూడాలని అన్నారు. సర్పంచ్ మోతీలాల్, పాఠశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

● **ఆదిభట్ల** : ఆదిభట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలికలను రక్షిద్దాం, ఎదగరిద్దాం, సాధికారత సాధింజేద్దాం అంటూ ప్రధానోపాధ్యాయులు వర్కాల పరమేష్ అన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. టీచర్ బబ్లీ తదితరులున్నారు.

● **చేవెళ్ల** : ఆడపిల్లలపై వివక్ష చూపొద్దని చేవెళ్ల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. బాలికల దినోత్సవం పురస్కరించుకుని చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అనురాధ, అధ్యాపకులు రూప్నా రవీంద్రన్, సతీష్, షేక్ మహబూబ్, రవీందర్, రాగిణి, స్వర్ణలత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కాంచనలత

దేవాలయ నిర్మాణంలో జాప్యమెందుకు?

- మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు.. ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు

షాద్‌నగర్, జనవరి 24 : ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో కొత్తగా నిర్మిస్తున్న హనుమాన్ మందిరం నిర్మాణం పనుల్లో తీవ్రజాప్యం జరుగుతోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు అన్నారు. ఈమేరకు బుధవారం రోడ్డు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. కొత్తూరు నుంచి సోలీపూర్ మధ్య పాత జాతీయ రహదారి విస్తరణకు లింగారెడ్డిగూడ బస్‌స్టాప్ వద్ద ఉన్న హనుమాన్ మందిరం అడ్డంకిగా ఉండడంతో ఆర్అండ్‌బీ అధికారులు, లింగారెడ్డిగూడ గ్రామ ప్రజలతో పాటు మాజీ ఎమ్మెల్యే బీశ్వ కిష్టయ్య, తాను మాట్లాడి ఆ దేవాలయానికి స్థానచలనం కల్పించి మరోచోట నిర్మించేందుకు అంగీకరించామని గుర్తు చేశారు. నూతన దేవాలయం నిర్మించేందుకు రూ.7లక్షలు మంజూరు చేస్తున్నట్లు అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హామీ ఇచ్చారని, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమిపూజ కూడా చేశారని, కేవలం 3.50లక్షలు మాత్రమే చెల్లించడంతో సదరు కాంట్రాక్టరు ఆలయ నిర్మాణం పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేశాడని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. అలాగే రోడ్డు విస్తరణలో భాగంగా షాద్‌నగర్ పట్టణంలోని వేంకటేశ్వరాలయం ముందున్న పురాతన రథశాలను తొలగించి ఆలయానికి నైరుతి భాగంలో నిర్మించేందుకు రూ.18లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. రథశాలను కూల్చొద్దని పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. పట్టణంలోని సర్వేనెంబర్ 171లో పెద్ద కల్వర్టు ఉండేదని, దాన్ని కూడా మూసివేశారని చెప్పారు. పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కింగ్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్ పక్కన రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా బక్కని లేఖలో పేర్కొన్నారు.





అసంపూర్తిగా ఉన్న దేవాలయం, మూసివేసిన కల్వర్టు

దేశాభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యం : బాబయ్య

కేశంపేట, జనవరి 24: భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. కేశంపేట మండలంలోని కొండారెడ్డిపల్లి, బైర్కాన్‌పల్లి, దత్తాయపల్లి, లింగంధన, బొదునంపల్లి, చింతకుంటపల్లి, దేవునిగుడి తండా, లేమామిడి గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. కొండారెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి బాబయ్య హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంత్యోదయ లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కృష్ణయ్య, మండల వ్యవసాధికారిణి శిరీష, ఉపసర్పంచ్ శివకుమార్, పల్లె బాలీశ్వర్, పల్లె అంజయ్య, రాజు, విజేందర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్, యువమోర్చా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ ఉదయ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బాబయ్య

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మొయినాబాద్ రూరల్ : కేంద్ర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ నాయకుడు, పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి కంజర్ల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, హిమాయత్ నగర్ సర్పంచ్ ముదిగొండ మంజులరవియాదవ్ సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర గ్రామానికి చేరుకోగా జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసి కార్యక్రమంలో అధికారులు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి రాగమ్మ, ఉపసర్పంచ్ శ్యాంరావు, ముదిగొండ రవియాదవ్,వార్డుసభ్యుడు యాదయ్య, నాయకులున్నారు.

తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకం

షాబాద్, జనవరి 24 : ప్రత్యేక తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకమని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం ఉద్యమకారుల సంఘం నాయకులు నగరంలో కోదండరాంను ఆయన నివాసంలో కలిసి ఫిబ్రవరి 4న ఆదివారం చేవెళ్ల పార్లమెంట్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరపున నిర్వహించే కృతజ్ఞత సభకు రావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. ఫోరం పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి, షాబాద్ మండలాధ్యక్షుడు చెన్నయ్య, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి అధ్యక్షులు మల్లేష్, మైపాల్, అధ్యక్షుడు అశోక్, నాయకులు రామకృష్ణ, శివకుమార్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



కోదండరాంకు ఆహ్వానపత్రం ఇస్తున్న నాయకులు

క్యాట్ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

ఆదిభట్ల, జనవరి 24 : దేశవ్యాప్తంగా జరిగిన క్యాట్ ఒలింపియాడ్ ఫలితాల్లో ఆదిభట్లలోని శ్రీచైతన్య విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఏజీఎం టి.సతీష్ తెలిపారు. క్యాట్ ఒలింపియాడ్ వారు 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో ఆదిభట్ల బ్రాంచ్‌కు చెందిన ఏడుగురు క్యాష్ ప్రైజ్‌లు, 241 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు సాధింగా మరో 102 మంది విద్యార్థులు మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్స్ సాధించినట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.



విద్యార్థులతో శ్రీచైతన్య యాజమాన్యం

సంక్షిప్తంగా..

● **కడ్తాల్** : మైసిగండిలో వారం రోజులు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. విజేత జట్లకు కాంగ్రెస్ నాయకుడు జవహర్‌లాల్ నాయక్ రూ.30 వేలు, బీజేపీ నాయకుడు రాందాస్‌నాయక్ రూ.20వేలు అందజేశారు. మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, నాయకులు రెడ్యానాయక్, భాస్కర్‌నాయక్, యాదగిరినాయక్, విక్రమ్, శంకర్, బాబులాల్, ప్రేమ్‌కుమార్, సర్దార్, వినోద్, నరేశ్, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

● **మాడ్గుల** : మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనులకు 15 ఆర్థిక సంవత్సరం వచ్చే నిధులకు అంచనాలు తయారు చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ గౌరవరం పద్మ అధ్యక్షతన ఎంపీటీసీల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిధుల ప్రణాళిక తయారుచేసి పంపాలని అన్నారు. ముఖ్యమైన పనులను గుర్తించి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఎంపీపీ సూచించారు. వైస్‌ఎంపీపీ శంకర్ నాయక్, ఎంపీటీసీలు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి, పాండు గౌడ్, పాల్గొన్నారు.

● **కడ్తాల్** : విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాలపై పట్టు సాధించాలని ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు, ఎంపీటీసీ రాములు అన్నారు. కడ్తాల జిల్లా పరిషత్ బాలికల, ఎక్వాయిపల్లి, చరికొండ ఉన్నత పాఠశాలల్లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్కాన్ అండ్ లర్న్ డిజిటల్ కంటెంట్ పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు.

● **యాచారం** : మండలంలోని గ్రామ పంచాయతీలలో ఓటర్ లిస్టులను రెవెన్యూ అధికారులు బుధవారం అతికించారు. నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ ఈనెల 20,21 తేదీలలో ప్రత్యేక క్యాంపెయిన్ చేసిన సంగతి విదితమే. ఏవైనా తప్పులుంటే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. తుది జాబితా వచ్చేనెల 8న విడుదల చేస్తామన్నారు.

● **ఆమనగల్లు** : పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని మునిసిపల్ చైర్మన్ నేనావత్ రాంపాల్ నాయక్ అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బుధవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ ప్రధాన కూడళ్లలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. కమిషనర్ శ్యామ్‌సుందర్‌తో కలిసి చైర్మన్‌పనులను పర్యవేక్షించారు.

● **శంషాబాద్** : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మహిళా మండలి ఆవరణలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయ్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. జిల్లా కార్యదర్శి డి.కిషన్ హాజరై ప్రసంగించారు. మున్సిపల్ కార్మికులకు రూ. 26వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ యూనియన్ ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నామని ఈ సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

● **కందుకూరు** : మండల కేంద్రంలోని నవతరం యూత్ అధ్యక్షుడిగా ఎం.మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం సీతారామశాస్త్రి ఫంక్షన్‌హాల్‌లో ఆ సంఘం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. అధ్యక్ష పదవికి ఎన్నికల నిర్వహించారు. సంఘం సభ్యుల్లో ఎం.మహేందర్‌రెడ్డి, టి.వినోద్ చారి, సాయిబాబా పోటీలో ఉండడంతో ఆ సంఘం మాజీ అధ్యక్షులు తాళ్ల కార్తీక్, ఎస్.వెంకటేష్‌గౌడ్‌లు ఎన్నికలు నిర్వహించారు. ఎం.మహేందర్‌రెడ్డికి 19 ఓట్లు, టి.వినోద్‌చారికి 13 ఓట్లు, సాయిబాబకు 4 ఓట్లు వచ్చాయి. మహేందర్‌రెడ్డికి 6 ఓట్ల మెజార్టీ రావడంతో అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తాళ్ల కార్తీక్, ఎస్.వెంకటేష్‌గౌడ్‌లు ప్రకటించారు. ఆ సంఘం మాజీ అధ్యక్షులు ఎండీ అజీజ్, బొక్క దీక్షిత్‌రెడ్డి, డి.రఘుబాబు, వెంకటేష్, శివకుమార్‌గౌడ్, సభ్యులు సతీష్, శ్రీనివాస్, వినోద్‌చారి, తదితరులున్నారు.

● **షాబాద్** : మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి అన్నారు. మాంటిసోరి గ్రూప్స్ యాజమాన్యం క్రీడా పోటీలు గత మూడురోజులుగా నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందజేశారు.

● **మొయినాబాద్ రూరల్** : హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ వర్సిటీలో చదువుతున్న సునీత రసాయశాస్త్రంలో 'డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ సమ్న్యూ ఇండోల్ డెరివేటివ్స్ యూస్ అంటీ కాన్సర్ ఏజెంట్ అనే అంశంపై పరిశోధన చేశారు. వెంకటనాగేశ్వరి జీవరసాయన శాస్త్ర విభాగంలో 'స్టడీస్ ఆన్ పాలిగారక్టురనేస్ ఎంజైమ్ ఫ్రమ్ అస్పర్జిలస్ నైగర్‌స్ట్రేస్'అనే అంశంపై పరిశోధనలు చేయగా డాక్టరేట్‌లు వరించాయి. కులపతి పురోషోత్తంరెడ్డి వారిని అభినందించారు.

క్రైం కార్నర్

అదనపు కట్నం వేధింపులు.. వివాహిత ఆత్మహత్య

- నాలుగో అంతస్తుపై నుంచి దూకి అఘాయిత్యం

మొయినాబాద్, జనవరి 24 : అదనపు కట్నం వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త, అతని తల్లి అదనపు కట్నం కోసం వేధించడంతో నాలుగో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు రాజీవ్ గృహకల్ప క్వార్టర్స్‌లో ఉండే కాడిగళ్ల రాజు కూతురు తార(21) అదే క్వార్టర్స్‌లో ఉండే గున్నడి రాహుల్ కొంత కాలం క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం అక్కడే ఓ అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. ఈక్రమంలో కొంతకాలంగా రాహుల్, అతని తల్లి అదనపు కట్నం, బైక్ తీసుకురావాలని తారన వేధించడం మొదలెట్టారు. మూడు రోజుల క్రితం మీ అమ్మానాన్నల దగ్గర డబ్బులు తేవాలంటూ భర్త, అత్త తీవ్రంగా వేధించారు. దాంతో మనస్తాపానికి గురైన తార బుధవారం ఉదయం 11:30 గంటల సమయంలో రాజీవ్ గృహకల్ప నాలుగో అంతస్తు పైకి వెళ్లి కిందికి దూకింది. గమనించిన స్థానికులు భాస్కర ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. వ్యక్తి మృతి

శంషాబాద్, జనవరి 24 : మున్సిపాలిటీ పరిధిలోని కోత్వాల్‌గూడ ఔటర్ రింగురోడ్డు సర్వీసు రోడ్డులో బుధవారం టిప్పర్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తి పోతయ్య(34) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని సాతంరాయిలో నివాసముండే పోతయ్య బైక్‌పై వెళుతుండగా కోత్వాల్‌గూడ ఔటర్ సర్వీసు రోడ్డులో టిప్పర్ అదుపుతప్పి బైక్‌ను ఢీకొంది. పోతయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. ట్రాక్టర్ సీజ్

కడ్తాల్, జనవరి 24: మండల పరిధిలోని ముద్విన్ గ్రామ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. అక్రమంగా ఫిల్టర్ ఇసుక తయారు చేసి ఆమనగల్లు, కడ్తాల మండలాలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం పెట్రోలింగ్ పోలీసు సిబ్బంది ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా సరికాదని అన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

- పది మందిపై కేసు.. రూ.60 వేల స్వాధీనం

చేవెళ్ల, జనవరి 24 : పేకాట స్థావరాలపై చేవెళ్ల పోలీస్‌లు దాడులు చేశారు. వివరాల్లోకి వెళితే.. చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్, నాన్‌చెరు గ్రామ శివారుల్లోని ఫామ్‌హౌస్‌ల్లో రెండు చోట్ల పేకాట ఆడుతున్నట్లు చేవెళ్ల పోలీస్‌లకు సమాచారం అందడంతో ఆ స్థావరాలపై దాడులు చేసి పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.60వేలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని పోలీస్‌లు తెలిపారు. కాగా, పట్టుబడినవారిలో గతంలో కూడా పోలీస్‌లకు చిక్కినవారు ఉన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

శంషాబాద్‌రూరల్ జనవరి 24 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సూచించారు. బుధవారం నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో చౌదరిగూడ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన 200 మంది కార్యకర్తలు, నాయకులు దీపదాస్‌మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఎక్కువ ఎంపీ సీట్లు గెలిచి రాహుల్‌గాంధీకి కానుకగా ఇవ్వాలని, ఆయన్ను ప్రధానిని చేసేవరకు కలిసికట్టుగా పని చేయాలని చెప్పారు. త్వరలోనే జిల్లాలో మరిన్ని చేరికలు ఉంటాయని జిల్లా అధ్యక్షుడు నర్సింహరెడ్డి తెలిపారు. మండలాధ్యక్షుడు శేఖర్‌యాదవ్‌ను ఆమె అభినందించారు. నాసిర్ హుస్సేన్, మధుయాస్కీగౌడ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్‌యాదవ్, ఫయీంబాయ్, కస్తూరి నరేందర్, అనిల్‌యాదవ్, ఎంపీటీసీ గౌతమిఅశోక్, లింగామయ్య, మహేష్, సురేష్, సత్తయ్య ప్రభాకర్, మల్లేష్, సిద్దు, మోహన్‌రావు, కుమార్, రాజు, ఉదయ్, సుమన్ పాల్గొన్నారు.



దీపాదాస్ సమక్షంలో పార్టీలో చేరుతున్న బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



అఫ్జల్‌కు నియామకపత్రం ఇస్తున్న కేఎల్లార్

కందుకూరు, జనవరి 24: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని నేదునూరు గ్రామానికి చెందిన ఎండీ అఫ్జల్‌బేగ్‌ను ఆ పార్టీ మండల కో-ఆర్డినేటర్‌గా నియమించినట్లు లక్ష్మారెడ్డి ప్రకటించారు. బుధవారం తుక్కుగూడలోని ఆయన కార్యాలయంలో పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డితో కలిసి ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేయాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. అఫ్జల్‌బేగ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో మండల కో-ఆర్డినేటర్‌గా నియమించడంపై నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఎస్.కృష్ణానాయక్, గంగుల ప్రభాకర్‌రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, పాపగళ్ల రవీందర్, వి.బాబు, వి.నారాయణ, పి.రాజు, మహేశ్వరం మండల నాయకులు అల్లె కుమార్, పి.తిరుపతయ్య, శ్రీను, నర్సింహ, వరుణ్, తదితరులున్నారు.

ప్రజా పాలనలో ప్రజలకు మెరుగైన వసతులు

కడ్తాల్, జనవరి 24 : కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలకు ఇబ్బందులు ఉండవని కడ్తాల ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోందని తెలిపారు. గోవిందాయిపల్లి తండాలో మండల పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలతో చేపట్టే అంతర్గత మురుగు కాల్వ నిర్మాణం పనులను బుధవారం స్థానిక సర్పంచ్ రాము నాయక్‌తో కలిసి ప్రారంభించారు. మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామన్నారు. మండలాధ్యక్షుడు మన్యనాయక్, కార్యదర్శి మధు, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

యాచారం, జనవరి 24 : గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు గాను నిధుల సమీకరణకు కార్యాచరణ రూపొందించాలని ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం చౌదర్‌పల్లిలో 2024-25 సంవత్సరానికిగాను బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రణాళికపై పంచాయతీ కార్యాలయ ఆవరణలో వార్డు సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏయే వాడల్లో ఏయే సమస్యలతో జనం ఇబ్బందులు పడుతున్నారో పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. గ్రామాలను నగరానికి దీటుగా అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ప్రజల నుంచి వందశాతం పన్నులు వసూలు చేస్తే మంచిదన్నారు. వంద శాతం పన్నులు వసూలు చేస్తే ప్రభుత్వం కొంత మేర నిధులు ఇస్తుందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఎన్.నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.